


వివరాలు మెయిన్‌లో

పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎర్రజెండా.....


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 13 జనవరి , 2026 | పేజీలు : 08


**తుది ఓటరు జాబితాతో పాటు**

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం



నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ** :మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నల్గొండ జిల్లాలో 7 మున్సిపాలిటీలలోని 162 మున్సిపల్ వార్డులలో తుది ఓటరు జాబితాను ప్రచురించడమే కాకుండా,మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు తెలియజేశారు.సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, కమిషనర్ డైరెక్టర్ శ్రీదేవిలు హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.నల్లగొండ జిల్లాకు సంబంధించి మున్సిపల్ ఎన్నికలకు తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ వివరిస్తూ ఈనెల 12 న వార్డుల వారిగా తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరిగిందని,13న ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురించడం జరుగుతుందని, వీటిపై అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం 16న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు.మున్సిపల్ ఎన్నికలను నిర్వహించేందుకు ఆర్ ఓ,ఏ ఆర్ ఓ,నోడల్ , ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలను గుర్తించడం జరిగిందని, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రిజర్వేషన్లు వచ్చిన వెంటనే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, మెటీరియల్‌కు ఇదివరకే చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. రెవెన్యూఅదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, ఆర్‌డిఓలు రమణారెడ్డి, శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జిల్లాలోని ఐదు మున్సిపాలిటిలలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హైదరాబాద్ నుండి మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమీషనర్లతో ఫోటో ఓటర్ జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటన, మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహిం చారు. తుది ఓటర్ జాబితా ప్రకటన, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా, తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రకటించి, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కొరకు నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, సెక్టోరియల్ అధికారులు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సామాగ్రి ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, ఆర్‌డిఓ వేణుమాధవ్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





## ఫిర్యాదులపై అధికారులు సత్వర చర్యలు
### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై శాఖలవారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ధరఖాస్తులపై పర్యవేక్షణ ఉంటుందని అలాగే కొన్ని శాఖలలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయని వాటిని తగ్గించుకోవాలని తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే ఫైల్స్ ఫర్నిచర్ క్రమపద్ధతిలో పెట్టుకోవాలన్నారు. త్వరలో ప్రతి కార్యాలయాన్ని తనిఖీ చేస్తానని అపరిశుభ్రంగా, ఫైల్స్ సరిగ్గాలేని కార్యాలయాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఉద్యోగి, సందర్శకులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలి వీటిని అతిక్రమించిన వారికి త్వరలో జరిమానాలను కూడా వసూలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా చూడటానికి హోటళ్లు, దాబాలు, ఫుడ్‌స్టాల్స్, తయారీ కేంద్రాలపై విస్తృతంగా తనిఖీలు, దాడులు నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల నుండి ప్రతి నెలా ఆహార నమూనాలను సేకరించాలని సూచించారు. కల్తీ ఆహారం విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. సంక్రాంతి సెలవులకు ముందు సంబంధిత ఫుడ్ సేఫ్టీ కమిటి అధికారులు, మండల విద్యాధికారులు అన్ని పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేసి ఆరు పదార్థాలు సరిగ్గా ఉన్నాయో లేవో చూడాలని కలెక్టర్ అన్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటి ఆఫ్ ఇండియా) లైసెన్సులను పొందేలా చూడాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 47 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆర్‌డిఓ వేణుమాధవ్, ఇంచార్జి డిఆర్‌డిఏ పిడి శిరీష, మహిళా సంక్షేమ అధికారి కె నరసింహారావు, హౌజింగ్ పిడి సిద్ధార్థ, జిల్లా వెటర్నరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అప్పగించకపోతే ఉద్యమం ఉధృతం

**ప్రజాపక్షం/కోదాడ:** 2023 అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ మంజూరు చేసిన 100 కోట్ల రూపాయల నిధులతో కోదాడ మున్సిపాలిటి పరిధిలోని బాలాజీనగర్ తన హాయంలో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మౌళిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అప్పగించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కోదాడ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొల్లం మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. సోమవారం వందలాది మంది బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో సూర్యనారాయణకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన ధర్నానుద్దేశించి మాట్లాడుతూ కలెక్టర్ పర్యవేక్షణలో ఆర్డీవో నేతృత్వంలో సిసి కెమెరాల మధ్య 560 మంది లబ్ధిదారులకు అర్హతను దృష్టిలో ఉంచుకుని పక్షపాతంగా ఎంపిక చేశామన్నారు. దీంతో పాటు ఇండ్ల సమీపంలో హెల్త్ సెంటర్, మిషన్ భగీరథ పైప్‌లైన్ కూడా వేయించామని, ఇక ఇండ్లకు విద్యుత్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయించాల్సిన పరిస్థితిలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌తో గృహ ప్రవేశాలు నిలిచిపోయాయని అన్నారు. 50 లక్షలతో ఇండ్లకు విద్యుత్ డ్రైనేజీ వ్యవస్థ కల్పిస్తే నిరుపేద లబ్ధిదారులు గ్రహప్రవేశం చేసుకుని వెసులుబాటు ఉందని ఆయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ మౌళిక వసతుల కల్పించకపోవడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలను వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న మంత్రి ఉత్తమ్ పద్మావతి దంపతులు 50 లక్షల రూపాయల నిధులు కేటాయించకపోవడం లబ్ధిదారులపై వారికున్న ప్రేమాభిమానాలను స్పష్టం చేస్తుందని విమర్శించారు. ఇలా కొంత కాలం గడిస్తే నిర్మించిన ఇండ్లు శిధిలావస్థతకు చేరుకునే పరిస్థితి ఉందని, తక్షణమే డబుల్ బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్ తాగునీరు డ్రైనేజీ తదితర మౌళిక వసతుల కల్పించి లబ్ధిదారులకు అప్పగించకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామన్నారు. ఈ అంశంపై కలెక్టర్ ను కలుస్తామని అన్నారు. కాగా బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల మౌళిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు ఆర్డీవో సూర్యానారాయణ స్పష్టం చేశారు. త్వరలో మంజూరైన నిధులతో వసతులు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ధర్నాలో టిఆర్ఎస్ నాయకులు ఎస్‌కె నయీం, పయిడిమర్రి సత్యబాబు, మామిడి రామారావు, మేదర లలిత, చింతల నాగేశ్వరరావు, అల్వాల వెంకట్, కర్ల సుంబర్‌బాబు, చీమ శ్రీనివాసరావు, గొర్రె రాజేష్, ఇమ్రాన్, అబ్బు, ఉపేందర్, చలిగంటి వెంకట్, మల్లయ్య గౌడ్, శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.





## ఉచిత వైద్య శిబిరం


**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరంలో గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఆధ్వర్యంలో కామినేని వైద్య బృందం , ఇతర వైద్య నిపుణుల బృందాలచే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఉచిత మందులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల స్వామి జయసుధ, యువ నాయకులు సింగనబోయిన గణేష్, వార్డు మెంబర్లు, సీనియర్ నాయకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌కి సన్మానం



**ప్రజాపక్షం/రామన్నపేట** : హైదరాబాద్‌లోని సుదరయ్య విజ్ఞాన కేంద్రంలో కురుమ యువ చైతన్య కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైనా సర్పంచ్ మరియు ఉప సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, గద్వాల్ మాజీ జడ్పీ చైర్మన్ సరిత, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమాల చేతులమీదగా రామన్నపేట మేజర్ గ్రామపంచాయతి ఉప సర్పంచ్ మోట్ రమేష్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

## క్రీడలకు ప్రోత్సహిస్తున్న యువ సర్పంచ్



**ప్రజాపక్షం/రామన్నపేట** : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ సంక్రాంతి సంబరాలలో భాగంగా యువతను మహిళలను సంక్రాంతి క్రీడలకు తన వంతు ఉత్సాహం అందిస్తూ యువతకు ఉత్తేజాన్ని అందిస్తున్నారు. మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు, యువతకు క్రికెట్ టోర్నమెంట్ తన సొంత నిధులతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడలలో నైపుణ్యాన్ని చూపిస్తూ మండల స్థాయిలో మన గ్రామ యువత పలువురికి ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు.

## చెరువు కాలువలు సరి చేయాలని ఈఈకి వినతి

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** మండల కేంద్రంలోని వీర్ల చెరువు నుండి కొత్త చెరువు పోయే కాలువ (మిర్ర కాలువ)వరకు పోయే కాలువను నక్ష ప్రకారం చూపించాలని ఆత్మకూర్ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ ఇరిగేషన్ ఈఈని కోరినట్లు తెలిపారు. ఈఈ స్పందించి త్వరలో కాల్వ సర్వే చేపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, మాజీ జెడ్పిటీసీ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, కోరే బిక్షపతి, గుండెగాని సత్తయ్య, లోడి శ్రీను, లోడి సోములు, 4వ వార్డు మెంబెర్ గడ్డం సతీష్ పాల్గొన్నారు.

## ధాన్యపు రాశుల సంక్రాంతి.. రైతుల పండుగ




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ధాన్యపు రాశులతో కళకళలాడే సంక్రాంతి రైతుల పండుగనీ విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు అన్నారు. పోచంపల్లి మండలం దేశ్ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. సంక్రాంతి విశిష్టతను తెలిపే రంగురంగుల రంగవల్లులు, కీర్తనలు, సాంప్రదాయ వంటకాలు, పతంగి పోటీలతో తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పండుగల్లోని విశిష్టతను, శాస్త్రీయతను విద్యార్థులు గుర్తించాలని సూచించారు. సంక్రాంతి పర్వదినాల్లో పల్లెటూళ్లు ఎంతో అందంగా, ఆహ్లాదంగా ఉంటాయని చెప్పారు. విశ్వవిద్యాలయ ప్రాంగణం సరికొత్త శోభను సంతరించుకుంది. అనంతరం పతంగి పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. ఆహ్లాద వాతవరణంలో వేడుకలు జరుపుకున్నారు. సంబరాల్లో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పాత, కొత్తవారిని కలుపుకొని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.నల్లగొండ పట్టణంలోని 21వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అఫ్జల్ ఖాన్ సోమవారం మాజీ శాసనసభ్యులు కంచర్ల సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతానికి పాటు పడుతూ రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేయడమే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,మాజీ కౌన్సిలర్ మారగోని గణేష్,పట్టణ కార్యదర్శి సయ్యద్ జాఫర్,మెరుగు గోపి జమాల్ ఖాద్రి,వార్డ్ అధ్యక్షులు షంశుద్దీన్,మాజీ కౌన్సిలర్ ఎస్.కె లతీష్,బోళ్ళ నరేష్,సయ్యద్ అబ్రార్,షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 6లక్షల టిఎస్‌యూటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి చెక్ పంపిణీ




**ప్రజాపక్షం/దేవరకొండ;** ఇటీవల మరణించిన కేజిబివి డిండి ఉపాధ్యాయురాలు, టిఎస్‌యూటిఎఫ్‌ఎఫ్ డబ్ల్యూఎస్ సభ్యురాలు పోతం నాగమణి(సిఆర్‌టి, కేజిబివి) కుటుంబ సభ్యులకు టిఎస్‌యూటిఎఫ్ గుండ్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో రూ. 6లక్షల ఎఫ్‌డబ్ల్యూఎఫ్ చెక్కును దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ నాగమణి మృతి బాధాకరం అని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి రూ. లక్ష ఆర్థిక సాయంగా ప్రకటించారు. ఈకార్యక్రమంలో టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వెంకటేషం, ఎఫ్‌డబ్ల్యూఎస్ నల్గొండ జిల్లా కన్వీనర్ నర్సింహా, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, దేవరకొండ డివిజన్ నాయకులు, గుండ్లపల్లి మండల బాధ్యులు, నాయకులు, కేజిబివి బాద్యులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఉల్లాస్ ప్రోగ్రాం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు చదువుకోనివారి కోసం ఈ ఉల్లాస్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిలాలలో మొత్తం 61వేల మంది చదువురాని మహిళలను గుర్తించామని అన్నారు. రిసోర్స్ పర్సన్స్ వారి పరిధిలో పది మంది వాలంటీర్ టీచర్లను గుర్తించి ఒక్కొక్క టీచర్‌కు పది మంది చదువురాని వారికి ఆ టీచర్ చదువు నేర్పాలని అన్నారు. అదేవిధంగా ఫార్మాట్ నింపేటప్పుడు ఆధార్‌కార్డు కాకుండా వేరే ఏ ఇతర గుర్తింపు కార్డులైనా అందులో నింపి ఉల్లాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోని చదువురాని వారికి చదువు చెప్పాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్ఞానేశ్వరి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ మమత, శ్రీనాద్, మెప్మా డీఎంసీ శివాజి, మాస్టర్ ట్రైన్ బాలు, మెప్మా టీఎంసీ బక్కయ్య, కమ్యూనిటి ఆర్గనైజర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సతీష్, రిసోర్స్ పర్సన్స్, ఎస్ఎల్ఎఫ్, ఓబీలు చంద్రకళ, సోమిదేవి తదితరులు పాల్గొన్నారు.



## పుస్తకాల ఊరేగింపు జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో ప్రజాకవి కాళోజి గ్రంథాలయం నుండి పుస్తకాల ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రంథాలయ అధ్యక్షుడు అందోజు నాగభూషణం మాట్లాడుతూ జనగాం గ్రామంలోని ప్రతి ఒక్కరికి గ్రంథాలయాన్ని, అదేవిధంగా పుస్తకాలను కూడా పరిచయం అవుతుందని, ఈ సెలవు రోజులనే కాకుండా మిగతా రోజులలో కూడా విద్యార్థిని విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎదటి తిరుమలేష్, స్వామి, రాజు రవితేజ, మల్లేష్, జంగయ్య, రవి, శ్రీకాంత్, మధు, నరసింహాచారి పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ -స్వచ్ఛ తాజ్ పూర్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్వచ్ఛ తాజ్ పూర్ లక్ష్యంగా ముందుకు సాగడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాజ్పూర్ గ్రామంలో సుమారు క్వింటాలు చెత్త మోయగల తడి చెత్త పొడి చెత్త ట్రాలీ చెత్త డబ్బాలను (డస్ట్ బిన్ )గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం వేసినచో సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి వారికి గ్రామపంచాయతీ రూ.500 నుండి రూ.1000 వరకు జరిమానా వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం, యువత, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలి



**ప్రజాపక్షం/నిడమనూరు** : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్‌లు పిలుపునిచ్చారు,కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు కూలీల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉమ్మడి సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కోడులు జి చట్టం జాతీయ విత్తన విధానం సవరణ బిల్లుల రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా ప్రచార జాతను సోమవారం నిడమనూరు మండల కేంద్రంలో సిఐటియు మండల కన్వీనర్ కోమండ్ల గురువయ్య రైతు సంఘం మండల కార్యదర్శి నల్లబోతు సోమయ్యలతో కలిసి జీబు జాతను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు అకారపు నరేష్,జిల్లా నాయకులు మల్లికంటి చంద్రశేఖర్,వేంపటి మహేష్,బొడ్డు లింగయ్య,నడ్డినాగరాజు,లెంకలపల్లి పరిపూర్ణచారి పాల్గొన్నారు.

## పెంచిన ఆర్‌టిసి చార్జీలను తగ్గించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం పండుగ సమయంలో పెంచిన ఆర్టీసీ చార్జీలను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ నాయకుడు తిరందాసు విష్ణు సోమవారం అన్నారు. పెంచిన ఆర్టీసీ చార్జీల వల్ల సామాన్య ప్రజలు, మధ్య తరగతి వర్గాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండాల్సినప్పటికీ చార్జీల పెంపుతో రోజు వారి ప్రయాణీకులపై మోయలేని భారం పడుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు కాకపోవడం ఒకవైపు ఉంటే మరోవైపు ఆర్టీసీ చార్జీల పెంపు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని పెంచుతుందన్నారు. ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోని ప్రభుత్వం వెంటనే పెంచిన ఆర్టీసీ చార్జీలను తక్షణమే తగ్గించి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు.



## మృతుల కుటుంబాలను పరామర్శ

**ప్రజాపక్షం/నకిరేకల్** : నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు.5వ వార్డుకు చెందిన బుడిగె లక్ష్మమ్మ, నకిరేకల్ పట్టణానికి చెందిన పాపని సత్తయ్య మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌగోని శ్రీనివాస్, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, మంగినపల్లి రాజు పాల్గొన్నారు.

## స్టేడియంలో వ్యాయామ పరికరాలకు మరమ్మతులు



**ప్రజాపక్షం/నకిరేకల్** : నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని స్టేడియంలో వ్యాయామ పరికరాలను మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ మరమ్మతులు చేయించి సోమవారం పరిశీలించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజు వ్యాయామం చేయడంవల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యవంతంగా ఉంటారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ బానోతు వెంకన్న,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న,మాచర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత సందేశం



**ప్రజాపక్షం/నకిరేకల్**: పట్టణంలో హరిదాసు వేషధారణలో రోడ్డు భద్రత,గంజాయిమాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం నిర్వహించారు.మద్దిరాల మండలం గోరంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ అక్షయపాత్ర, తంబురాతో హరినామ సంకీర్తన చేస్తూ వీధుల వెంట తిరిగి మత్తు పదార్థాల దుష్పరిణామాలు, రోడ్డు భద్రత ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమానికి స్థానికుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.

## ప్రజలపై భారాలు

**ప్రజాపక్షం/నకిరేకల్** : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలతో సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని మహిళా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల విమర్శించారు.సోమవారం నకిరేకల్ మండలం కడపర్తి గ్రామంలో సీఐటీయు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతాను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా కమిటీ సభ్యులు వంటిపాక వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు,గీత సంఘం నాయకులు రాచకొండ వెంకట గౌడ్,ఆకుల భాస్కర్,వంటిపాక కృష్ణ పాల్గొన్నారు.

## చైనామాంజా విక్రయిస్తున్న 6గురు వ్యక్తులపై కేసు నమోదు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : చైనామాంజా విక్రయిస్తున్న 6గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. చైనామాంజా విక్రయాలపై సూర్యాపేట పట్టణ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా సూర్యాపేట పట్టణంలో అక్రమంగా అమ్ముతున్న ఆరుగురు వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశామని వెల్లడించారు. సూర్యాపేట పట్టణ ఎస్ఐలు శివతేజ, మహేందర్ నాథ్, ఏడుకొండలు ఆధ్వర్యంలో టీమ్స్ ఏర్పాటు చేసి రైడ్స్ నిర్వహించామన్నారు. చైనా మాంజా విక్రయించినా కొనుగోలు చేసినా నేరమని ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. చైనా మాంజా ఉపయోగించడం వల్ల సీసపు దారం ద్విచక్రవాహనదారులకు తగలడం, పక్షులకు తగలడం వల్ల ప్రాణాపాయాలు సంభవిస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ఎవరూ కూడా పిల్లలకు ఈ చైనా మాంజాను కొనివ్వ కూడదని సూచించారు.

## అరైవ్ ఎలైవ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : రోడ్డు భద్రత పట్ల ప్రజలకు మరింతగా చేరువై అవగాహన కల్పించడానికి అరైవ్ ఎలైవ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు. దీని కోసం జిల్లావ్యాప్తంగా ప్రజలను విద్యార్థులను పౌరులను అవగాహన కార్యక్రమాల్లో భాగం చేస్తున్నామని రోడ్డు భద్రత, రోడ్డు నియమ నిబంధనలు, ప్రమాదాల నిర్మూలనకై తీసుకోవల్సిన జాగ్రత్తల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి లతో కలిసి ఆరైవ్ ఎలైవ్ అవగాహన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి రోడ్డు అరైవ్ ఎలైవ్ కార్యక్రమం ఉద్దేశాన్ని లక్ష్యాన్ని గురించి వివరించారు. సూర్యాపేట, కోదాడ మున్సిపాలిటి కేంద్రాల్లో వార్డుల వారీగా రోడ్డు భద్రత కమిటిలు, మండల పరిధిలో గ్రామాల వారీగా రోడ్డు భద్రత కమిటిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సైబర్ సెక్యూరిటి సెల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ, నాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర రావు, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

## ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సోమవారం పట్టణంలో జిల్లా సంక్షేమ అధికారి కె నరసింహరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డే కేర్ సెంటర్‌ను తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్, డైరెక్టర్ శైలజ వర్చువల్‌గా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుత కాలంలో వయోవృద్ధులు ఒంటరితనంతో బాధపడుతున్నారని, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అలాంటి వారికి కాలక్షేపం కోసం డే కేర్ సెంటర్ నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఇది నడుస్తుందని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ కోసం డే కేర్ సెంటర్‌లో టివి, ఇండోర్ గేమ్స్, లైబ్రరీ, విశ్రాంతి తీసుకొనుటకు సౌకర్యాలు కల్పించామని చెప్పారు. స్నాక్స్, పండ్లు అందిస్తామని ఈ సదుపాయాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనిని రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి సంయుక్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు విద్యాసాగర్, హమీద్‌ఖాన్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఇరిగి కోటేశ్వరి, ట్రెజరర్ పెద్దిరెడ్డి గణేష్, మేనేజింగ్ కమిటి సభ్యులు మీలా మహాదేవ్, తోట శ్యామ్‌ప్రసాద్, గూడా రమేష్, రమాదేవి, బైరు వెంకన్న, డాక్టర్ దుర్గాబాయ్ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బొల్లం వ్యాఖ్యలు అర్థరహితం



**ప్రజాపక్షం/కోదాడ**: గ్రీన్ ట్రిబ్యునల్ బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు లు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్ బాధితులకు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. బొల్లం ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నోటీసులు వచ్చిన వెంటనే ఆ వార్డు కాంగ్రెస్ నాయకులు గడప గడపకు తిరిగి ఇళ్లకు సంబంధించిన ప్రూఫ్స్ సేకరించి అధికారులకు సమర్పించి కార్యాచరణ చేస్తూనే ఉన్నారని అన్నారు. ఇంకా ఆధారాలు ఇవ్వని వారి పక్షాన ఆధారాలు సేకరించి అధికారులకు తామే సమర్పిస్తామన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో ముత్తవరపు పాండురంగారావు, పార సీతయ్య, ఈదుల కృష్ణయ్యతో పాటు నాయకులు పాల్గొన్నారు.



## ఫోటో ఓటర్ జాబితా విడుదల

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ పురపాలక సంఘానికి చెందిన 48 వార్డుల తుది ముసాయిదా ఫోటో ఓటర్ లిస్ట్‌ను మున్సిపల్ కార్యాలయంలో పబ్లికేషన్ చేయడం జరిగిందని మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన ఫోటో ఓటరు లిస్టును కార్యాలయంలో ప్రచురించి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో 1నుంచి 48 వార్డుల ఓటరు లిస్టులు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ మేనేజర్ జ్ఞానేశ్వరి, టీపీవో అంజయ్య, ఆర్ఐలు సాంబయ్య, మనోజ్‌కుమార్, ప్రసాద్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ షాపు ప్రారంభం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: పట్టణంలోని అద్దంకి నార్కట్‌పల్లి బైపాస్ వద్ద కుమ్మరి రమేష్ నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ షాపును సోమవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్దార్థ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు మంచి నాణ్యమైన కాఫీని అందించి వారి మన్ననలను పొందాలని, యాజమాన్యం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అన్నభీమోజు నాగార్జునచారి, తుమ్మల ఫణికుమార్, సజ్జల శ్రీనివాస్‌రెడ్డి, ఎండి.షోయబ్, నాగ నాయక్, క్రాంతి, హోటల్ యాజమాన్యం పాల్గొన్నారు.

## గృహజ్యోతి పథకం ప్రజలకు మేలు



**ప్రజాపక్షం/నకిరేకల్** : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలవుతున్న గృహజ్యోతి పథకం ద్వారా పేద ప్రజలకు మేలు చేకూరుతుందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ అన్నారు.నకిరేకల్ పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వద్ద గృహజ్యోతి పథకానికి సంబంధించిన హామీ అమలుపత్రాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బొప్పని సైదులు,చెనగోని రాజశేఖర్,లక్ష్మణ్, వంశీ,ప్రేమ్, సతీష్,గిరి,శేఖర్,సాయి,ఉపేంద్ర చారి,చేగోని ఎల్లమ్మ,పోతుల మంగమ్మ,ధనమ్మ,శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మకర సంక్రాంతి ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/నకిరేకల్** : నకిరేకల్ పట్టణంలోని శ్రీ షిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయ ప్రాంగణంలో రంగవల్లులుముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది మహిళలు పాల్గొన్నారు.ఈ పోటీల్లో ప్రథమ బహుమతి ఇరుగు రజిత, ద్వితీయ బహుమతి సిరిపురం లక్ష్మీ కళ తృతీయ బహుమతి పెండం ధనుష గెలుపొందారు. పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు ట్రస్ట్ తరపున అందజేశారు.ఈకార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు బండారు వేణుగోపాల్,దాచేపల్లి శ్రీనివాసు,దేవరశెట్టి మధుసూధన్,బాణాల రాంరెడ్డి పాల్గొన్నారు.





## హలో బిసి ఛలో ఢిల్లీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఫిబ్రవరి 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న హలో బీసీ ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ మెమంతో మాకంత వాటా దక్కాలని, బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో నాగేందర్, భీమరాజు, వెంకటేష్, గణేష్, శరత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాస్యతపై అవగాహన



**ప్రజాపక్షం/మునగాల:** ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఆర్‌సి కెవైసి చేయించుకోవాలని , సామాజిక భద్రత పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బిఐ ఆకుపాముల మేనేజర్ సుమన్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో గ్రామ ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, సిఎఫ్ఎల్ నడిగూడెం కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, ఉదయ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## అఖిలభారత జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అఖిలభారత ప్రజాతంత్ర మహిళ సంఘం 14వ జాతీయ మహాసభలు ఈనెల 25నుండి 28వ తేదీ వరకు హైద్రాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో ప్రతిష్టాత్మకంగా జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కమిటి సభ్యురాలు సుందరి రమాదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కీతావారిగూడెంలో కామ్రేడ్ సుందరి భిక్షమయ్య భవనంలో జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బూతం సరిత, దొంతగాని తార, ఆవుల జ్యోతి, పాలెల్లి వీరమ్మ, ఆవుల వీరమ్మ, బాదె దనమ్మ, ఎల్లావుల పిచ్చమ్మ, ఒట్టెపు ఉమా, జుట్టుకొండ అనసూయమ్మ, బండారు జ్యోతి, ధారావత నాగమ్మ, బండారు వీరనాగ, పాలెల్లి వెంకమ్మ పాల్గొన్నారు.



## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామానికి చెందిన సుంకోజు బిక్షపతి చారి మరణించారు. వారి కుటుంబానికి ఏజెఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి రూ.5000 వారి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ లూటీ, పోలీసుల లాఠీ రాజ్యమే



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేస్తూ ప్రశ్నించిన వారిపై పోలీసుల లాఠీలతో సమాధానం చెబుతూ రాజ్యమేలుతుందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని దొరకుంట గ్రామంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నుండి గెలుపొందిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన వారిని సన్మానించి మాట్లాడారు. రాష్ట్రంలో అమలుకానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండేండ్లు గడుస్తున్నా హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉందని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఎన్నిక ఏదైనా బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు మళ్ళీ అధికారంలోకి రావడం కష్టమని గ్రహించి కోట్ల రూపాయల దోపిడికి తెగబడుతున్నారని సమస్యలపై ప్రశ్నించిన వారిపై పోలీసుల లాఠీలతో సమాధానం చెప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు శ్రీకాంత్, మాజీ ఎంపిపి చింత కవిత రాధారెడ్డి, కాపుగల్లు గ్రామ సర్పంచ్ దొంతగాని అప్పారావు, ఎడ్లపల్లి వెంకటేశ్వర్లు, గంటా శ్రీనివాసరావు, దొంగల లక్ష్మీనారాయణ, బ్రహ్మం చంద్రమౌళి పాల్గొన్నారు.

# సభ్య సమావేశానికి నేతల బూతుల మెసేజ్

**ప్రజాపక్షం/పాలకవీడు:** ఇటీవల కాలంలో పత్రికల్లో, టివి చానల్లలో సోషల మీడియాలో సభ్య సమాజానికి రాజకీయ నేత బూతులు మెసేజ్ పంపిస్తున్నారని ఇది సమాజానికి అత్యంత ప్రమాదకరంగా దాపురించిందని తెలంగాణ నేతలు యువ సమాజానికి ఏమీ సందేశమిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు కాంగ్రెస్, బిజేపి, టిఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. సోమవారం ఆయన పాలకవీడులో మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బూతులు మాట్లాడటమే నాయకుడికి ఆభరణంగా మారిందని, మాటకు ముందు ఒక బూతు, మాట తర్వాత ఒక బూతు మాట్లాడుతూ నేతల సమాజాన్ని బూతుమయం చేస్తున్నారని , కమ్యూనిస్టులు మినహా మిగతా వారు బూతు మాటల్లో పోర్లాడుతున్నారని, గతంలో రాష్ట్రానికి ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రులుగా కొనసాగిన సందర్భంగా ఇలాంటి నీచమైన భాషను ఉపయోగించలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని పట్టుకుని ఆరే బట్టేబాజ్ అని ఒక జాతీయ పార్టీ నాయకుడు పార్లమెంట్ సభ్యులు సంబోధిస్తున్నాడని, పీకనికి అసెంబ్లీకి వచ్చినవా అని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడుతున్నారని, ఇక కెటిఆర్ నోటికి తలుపు తాళం ఉండదని, మహిళ నాయకులు కూడా ఇదే విధంగా మాట్లాడుకోవడం అత్యంత శోచనీయమని, భావితరాలకు మీరు ఏమీ సందేశం ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

# నేడు నకిరేకల్‌లో పోచంపల్లి బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన 20వ బ్రాంచ్ నకిరేకల్‌లో నేడు ప్రారంభిస్తున్నట్లు ఆ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ సోమవారం ఒక పర్యటనలో తెలిపారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా బ్యాంకు శాఖను ప్రారంభోత్సవం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ అవార్డులతో పాటు ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తూ అగ్రగామి బ్యాంకుగా అవతరిస్తున్నందుకు సహకరిస్తున్న డిపాజిటర్లకు బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఈవో సీత శ్రీనివాస్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్‌లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరి శంకర్, సూరేపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్ల స్వామి, మక్తాల నరసింహ, బిట్టు భాస్కర్ ఆయన వెంట ఉన్నారు.

## పిఆర్‌ఆర్ ఫౌండేషన్ అధినేతకు కలెక్టర్ సన్మానం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం పిఆర్‌ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు అందిస్తున్న లాస్ట్ మినిట్ రివిజన్ బుక్ పంపిణీ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావును ఆహ్వానించిన సందర్భంగా పిఆర్‌ఆర్ ఫౌండేషన్ నిర్వహించే సేవా కార్యక్రమాలను గుర్తించి కలెక్టర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావుకి చిరు సన్మానం చేశారు. కలెక్టర్ హనుమంతరావు కలిసిన వారిలో డిఆర్‌డిఎ అడిషనల్ పీడీ జంగారెడ్డి, ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ నెంబర్స్ గండికోట రాజేష్, పోతనబోయిన కొండలు, మెడమోని శేఖర్ పాల్గొన్నారు.



## అండర్19 ఉమ్మడి నల్లగొండ జిల్లా కబడ్డీ పోటీలు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని సర్వారం గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్19 ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నామ నర్సింహారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం వారు కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సర్వారం క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిచ్చి గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకరావాలని అన్నారు. క్రీడాకారులు జిల్లా అసోసియేషన్ తరుపున ఎల్లప్పుడు సాహయ సహకారాలుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతకాయల నాగేశ్వరరావు, నాగిరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.





## బహిరంగ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18వ తేదీన ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మోటకొండూర్ సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి ఆలేటి బాలరాజు మోటకొండూర్ పట్టణ కేంద్రంలో గోడపత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేష్, గ్రామ శాఖ సహాయ కార్యదర్శులు జివిలికపల్లి పాండు, బీరకాయల మధు, పార్టీ సభ్యులు జీలికపల్లి గణేష్, శనిగరం యాదగిరి, బీరకాయల పోషయ, రేగు యాద య్య, గొట్టిపాముల సునీల్ కుమార్, ఎండి గుంశి పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభ్యర్థుల గెలుపు సహకారం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల గెలుపు కోసం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి భరోసానిచ్చారు. స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని కులాల వర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి అని ప్రజల్లో పార్టీ పట్ల ఎమ్మెల్యేల పట్ల ఇంకావిశ్వాసం ఉందన్నారు. టౌన్ అధ్యక్షుడు సీత వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కోట మల్లారెడ్డి పుష్పలత, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధారుడ్యం ఏర్పడుతుందని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, మండల అభివృద్ధి ప్రదాత దూదిపాల శ్రీధర్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో భవ్య డివిజన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను సోమవారం వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నేటి యువత చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు అందుగుల పూజ వెంకటయ్య, ఆర్గనైజర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్ సహాయం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో శివరాత్రి పోచమ్మ నివసించే గుడిసెఇళ్లు, నిత్యావసర సరుకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, ఈ విషయం తెలుసుకొన్న వార్డు మెంబెర్ కొండ పద్మ దేవేందర్ బాధిత పోచమ్మ కుటుంబానికి నిత్యావసర సరుకులు, ఇతర సామాన్లు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివరాత్రి లావణ్య జహంగీర్, ఉపసర్పంచ్ గోనె జహంగీర్, వార్డు మెంబర్స్ తూటి సుమలత మహేష్, తూటి రవికిరణ్, లింగాల సత్యం, గోధుమకుంట మధు, కొండ పాండు పాల్గొన్నారు.



## ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలోని బొడ్రాయి సెంటర్ వద్ద ముగ్గుల పోటీలను సర్పంచ్ గుండు రామాంజీగౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బల్దూర్, సందీప్, గుండు అశోక్, కరుణాకర్, వీరబాబు, పంచాయతీ కార్యదర్శి సునిత, కోల సంధ్య, కోల నాగమణి, సతీష్, పవన్ పాల్గొన్నారు.

## అక్కులు జీవితం ఆదర్శప్రాయం



**ప్రజాపక్షం/పాలకవీడు:** మాజీ సర్పంచ్ అక్కులు జీవితం ఆదర్శప్రాయమని సిపిఎం మండల కార్యదర్శి కందగట్ల అనంతప్రకాశ్, జిల్లా కమిటి సభ్యులు నగేష్లు అన్నారు. సోమవారం గుడుగుంట్ల పాలెం గ్రామంలో అక్కులు దశదినకర్మలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పగడాల మల్లేష్, గుర్రం ధనమూర్తి, ఎర్రెడ్ల మల్లారెడ్డి, పురుషోత్తంరెడ్డి, దొరికొండ వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, యేసురత్నం, పాతూరి శ్రీనివాసరావు, తిరపతయ్య, నర్సింహా పాల్గొన్నారు.

## అభివృద్ధికి శ్రీకారం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ప్రజా పాలనలో భాగంగా గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తానని పరెడ్డిగూడెం సర్పంచ్ కేతిపల్లి నర్సయ్య అన్నారు. సోమవారం గ్రామంలోని వీధులను శుభ్రం చేయించారు. డ్రైనేజీ పూడికతీతను తీయించారు.గ్రామంలో మౌళిక సదుపాయల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ మల్లారెడ్డి, వార్డు మెంబర్లు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/గుండాల**; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడివో కార్యాలయంలో సోమవారం పంచాయతీ రాజ్ శాఖ నూతన సంవత్సరం 2026 క్యాలెండర్‌ను ప్రభాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు దేవేందర్‌గుప్త, ఎంపిడివో చంఢీరాణి, ఎంపివో, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రస్తుత కాలంలో వయో వయోవృద్ధులు ఒంటరి తనంతో బాధపడుతున్నారని,మానసికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని,అలాంటి వారికి కాలక్షేపం కొరకు డే కేర్ సెంటర్ నిర్వహించడం హర్షించదగ్గ విషయమని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ అన్నారు. ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సిఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఎస్‌సి,వయో వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్,వికలాంగుల కాపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య,ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్,డైరెక్టర్ శైలజ వర్చువల్ గా ప్రారంభించారు. నల్లగొండ పట్టణంలో నడిబొడ్డున గల అటువంటి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బిల్డింగ్ నందు ఇక్కడ వినోదం కాలక్షేపము ఆటలు,వైద్య మరియు సలహా సూచనలు ఇవ్వడం ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. జిల్లా సంక్షేమ అధికారిని కెవి కృష్ణవేణి మాట్లాడుతూ డే కేర్ సెంటర్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నడుస్తుందని,సీనియర్ సిటిజన్స్ కొరకు డే కేర్ సెంటర్ నందు టీవీ,ఇండోర్ గేమ్స్,లైబ్రెరీ,విశ్రాంతి తీసుకొనుటకు సౌకర్యాలు కల్పించామని, స్నాక్స్, పండ్లు అందించబడినని, వయో వృద్ధులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని,ప్రణామ్ వయో వృద్ధుల డే కేర్ సెంటర్ అరుణ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారిచే నిర్వహణ చేయబడుతుందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థ మరియు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నడపబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్ కలర్ సొసైటీ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ పిడి రాజకుమార్,సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జున్,సుదర్శన్ రెడ్డి,సిడిపిఓ,నిర్మల, చంద్రకళ పాల్గొన్నారు.

## బంజారా సేవ నూతన కమిటీ ఏకగ్రీవం



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలో సోమవారం బంజారా సేవ రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ నాయక్,రాష్ట్ర ఉపాధ్యక్షులు మెగావత్ నంద నాయక్, మెగావత్ నీలా రవి నాయక్ ఆధ్వర్యంలో నూతనంగా కమిటీ ఏర్పాటు చేశారు.బంజారా సేనా నల్లగొండ జిల్లా నూతన అధ్యక్షులుగా మేగావత్ రామ్ కుమార్,నాంపల్లి మండల అధ్యక్షులుగా మేగావత్ రమేష్ నాయక్, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఎన్నికైన వాళ్ళు మాట్లాడుతూ మా ఎన్నికల సహకరించిన రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ,బంజారా హక్కు సాధనకై నిరంతరం కృషి చేస్తామని బంజారా సేవ సంఘాన్ని బలోపేతం చేస్తామని బంజారా సమస్యలను మా దృష్టికి వచ్చినవి పరిష్కరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు.రాందాస్ తండా ఉప సర్పంచ్ రమేష్ నాయక్,మాజీ ఉప సర్పంచ్ రవి నాయక్,మెగావత్ సర్దార్,వంశీ,గోవర్ధన్, హరి,కృష్ణ, వినోద్, గోపాల్ నాయక్,శ్రీను, రాంబాబు, దశరథ్, బాలాజీ నాయక్, చిరంజీవి పాల్గొన్నారు.

## అధికారులకు రాజ్యాంగం పుస్తకం బహుకరణ



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో ఇటీవల ఎన్నికైన యువ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ ముందుకెళ్తున్నాడు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యలయంలో ఏర్పాటు చేసిన సర్పంచుల ఆత్మీయ సన్మాన సభలో మండల అధికారులు సర్పంచులను శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా దత్తాయపల్లి గ్రామ సర్పంచ్ కరుణాకర్ దేశాన్ని ముందుకు నడిపించే మహాగ్రంధమైన రాజ్యాంగ పుస్తకాన్ని ఎంపిడిఓ లెంకల గీతారెడ్డి, ఎంపిఓ వెంకటేశ్వర్లకు బహుకరించడం సన్మాన సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్ ఆశయ సాధనతో, స్వామి వివేకానంద స్ఫూర్తితో గ్రామంలో విద్యార్థులను పుస్తక ప్రదర్శనలకు తీసుకెళ్లడం, విద్య, సేవ సమానత్వం అనే ఆశయాలతో గ్రామంభివృద్ధికి అంకితమై పనిచేస్తున్నానని తెలిపారు.

## కార్యకర్త తల్లి పాడె మోసిన ఎమ్మెల్యే జైవీర్



**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాకునూరి నారాయణ గౌడ్ తల్లి ఆదివారం రాత్రి మృతి చెందింది. సోమవారం ఆమె అంత్యక్రియలను అనుముల గ్రామంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి, కుందూరు జానారెడ్డికి విధేయుడైన కాకునూరి నారాయణ గౌడ్ పట్ల జానారెడ్డి కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. ఈక్రమంలో నారాయణ గౌడ్ తల్లి బాలమ్మ ఆదివారం రాత్రి మృతిచెందడంతో సోమవారం నాడు ఆమె అంత్యక్రియలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి అనుముల మండలంలో ముఖ్యుడైన కాకునూరు నారాయణ గౌడ్ పై ఉన్న అభిమానంతో ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి సోమవారం నిర్వహించిన అంత్యక్రియల్లో బాలమ్మ పాడేమోసి కార్యకర్తలపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సంఘటన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో ఒక కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని చెప్పడంలో సందేహం లేదేమో.



## సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/మునుగోడు :** సిపిఐ 100 వసంతాల ముగింపు బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు,బొల్గూరి నరసింహ పిలుపునిచ్చారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 100 సంవత్సరాలుగా దేశంలోని పేద ప్రజల,కార్మికుల,కర్షకుల,యువజన,విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగించిన చరిత్ర సిపిఐదని కొనియాడారు,నేటి పాలక పార్టీలు అవకాశవాద రాజకీయాలను అవలంబిస్తూ ప్రజలను ఓటు యంత్రాలుగా మార్చాలని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్,జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి,బిలాలు,కట్కూరి లింగస్వామి,గోపగోని ఉదయ్,దామ్ వెంకన్న,బక్క కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

## గంజాయితో నాశనం చేసుకోవద్దు



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : గ్రామాల్లో యువత గంజాయి, డ్రగ్స్ మత్తులో పడొద్దని, విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ప్రాణాలకు ప్రమాదంగా మారుతున్న పతంగులకు వాడే చైనా మాంజాను బహిష్కరించాలని, సర్పంచ్ కర్రే మాధవి కరుణాకర్ గౌడ్ తెలిపారు. గ్రామంలో వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో సర్పంచ్ ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి జహంగీర్ కళాబృందం సభ్యులు, వెంకటాపురం గ్రామపంచాయతీ పాలకవర్గం, మహిళలు, యువతీ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ,ఐద్వా ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/మాడుగులపల్లి :** డివైఎఫ్ఐ,ఐద్వా ఆధ్వర్యంలో ఆగామోత్కూర్ గ్రామంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.ప్రథమ బహుమతి బొమ్మకంటి ఐశ్వర్య, ద్వితీయ బహుమతి అండెం మౌనిక,తృతీయ బహుమతి ఎల్లుట్ల యామిని గెలుపొందారు.ఈ ముగ్గుల పోటీకి సహకరించిన దాతలు ప్రథమ బహుమతి దాత స్థానిక సర్పంచ్ అండెం రేణుక యాదయ్య,ద్వితీయ బహుమతి దాత కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భూపతి ఊషయ్య,ప్రత్యేక బహుమతుల దాత పీపుల్స్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వారి మణికంఠ మెడికల్ జనరల్ స్టోర్స్ తరుపున అందజేసిన డాక్టర్ లక్ష్మయ్య పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి,మాజీ వైస్ ఎంపీపీ పాదూరు గోవర్ధన,సీఐటీయూ జిల్లా నాయకులు రొండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/రామన్నపేట :** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ లోక్ సభ సభ్యురాలు ప్రియాంక గాంధీ జన్మదినం సందర్భంగా రామన్నపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సుభాష్ సెంటర్లో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దిన్, సర్పంచ్ గరిక సత్యనారాయణ పాల్గొన్నారు.



# భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మికతను చాటిచెప్పిన మహనీయుడు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మికతను ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనియాడారు. సూర్యాపేట పట్టణంలోని మున్సిపాలిటి కార్యాలయం ఆవరణలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ముఖ్యఅతిధిగా ఆయన పాల్గొని వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, వ్యక్తిత్వం, క్విజ్ పోటీలలో ప్రతిభ చూపెట్టిన వారికి కలెక్టర్, ఎస్పి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి, తహశీల్దార్ కృష్ణయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్లు జుట్టకొండ సత్యనారాయణ, అన్నపూర్ణ, వివేకానంద ఉత్సవ కమిటి చైర్మన్ నాగార్జున, కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వివేకానందుని బోధనలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు.జాతీయ యువజన దినోత్సవం ,స్వామి వివేకానంద 164 వ జయంతి ని పురస్కరించుకొని సోమవారం ఆయన అదనపు ఎస్ పి రమేష్ తో కలిసి నల్గొండ జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అదనపు ఎస్ పి రమేష్ మాట్లాడుతూ నేటి యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తిదాయకమని అన్నారు.జిల్లా క్రీడలు,యువజన సర్వీసుల శాఖ అధికారి మీర్ అక్బర్ అలీ,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ నకిరేకల్:** యువత వివేకానందుడిని ఆదర్శంగాతీసుకుని లక్ష్యం వైపు ప్రయాణించాలని డిఎస్‌పి శివరాం రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చందుపట్ల గ్రామంలో వివేకానంద యువజన మండలి ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని పురస్కరించుకుని డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివేకానంద యువజనమండలి అధ్యక్షుడు కొండ కోటేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ వెంకటే,ఎస్ఐ క్రిష్ణామాచారి,మై భారత్ ఉమ్మడి జిల్లా కో ఆర్డీనేటర్ రాజేష్, సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారిపాల్గొన్నారు.

**ప్రజాపక్షం/యాదాద్రి :** జాతీయ యువజన దినోత్సవం 2026 సందర్భంగా స్వామి వివేకానంద జయంతినీ పురస్కరించుకొని భువనగిరి టౌన్‌లోని వివేకానంద విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంత రావు స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేస్ చిస్తి, జిల్లా యువజన మరియు క్రీడాల అదికారి ధనంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, మున్సిపల్ కమిషనర్ రామలింగం, ఎస్.సి కార్పొరేషన్ ఈ.డీ శ్యామ్





సుందర్, జిల్లా యువజన సంఘం నాయకుడు కరుణ్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వివేకానందుడి జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని సమసమాజ స్థాపనకు కృషి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజద్‌అలీ, వుప్పల సత్యనారాయణ, తూడి విద్యాసాగర్, బైరు నాగరాజు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ఆలేరు :** మన దేశం ప్రగతి పథంలో నడవాలంటే యువత మరియు విద్యార్థులదే కీలకపాత్ర అని, అట్టి యువతకు స్వామి వివేకానంద జీవితం ఆయన బోధనలు శిరోధార్యం అని శ్రీ రామకృష్ణ విద్యాలయం ప్రధానాచార్య బండిరాజుల శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తరిగొప్పుల రమేశ్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/ఆలేరు :** స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివేకానంద సేవా సమితి, భువనగిరి ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ విద్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేయడం అంటే ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయడమేనని వివేకానంద సేవా సమితి అధ్యక్షులు బాదం ప్రకాశ్ అన్నారు. వివేకానంద సేవా సమితి సభ్యులు బండిరాజుల శంకర్‌పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నూతనకల్ :** స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతుబజార్ చికెన్ సెంటర్ యజమాని గొడిశాల రేణుక లింగన్న గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి



ఉత్సవాలలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, మండల అభివృద్ధి అధికారి సునీత పాల్గొన్నారు

**ప్రజాపక్షం/చండూరు:** స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలను సోమవారం చండూరు లో భారతీయ జనతా పార్టీ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. చండూరు సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద చిత్రపటానికి బిజెపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



**ప్రజాపక్షం/చిట్యాల:** భారతదేశ ఆధ్యాత్మికతను ప్రపంచానికి పరిచయం చేసిన మహానుభావుడు స్వామి వివేకానందుడని నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. పట్టణ కేంద్రంలో టియుడబ్ల్యూజెహెచ్ 143 ఆధ్వర్యంలో నిర్వహించిన వివేకానందుని జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మూడ వేణు, కొల్లోజు శ్రీకాంత్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని సోమవారం మహమ్మదాపురం గ్రామ పంచాయతీ లో సర్పంచ్ బొమ్ము సంతోష చంద్రశేఖర్ ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.




**ప్రజాపక్షం/హాలియా:** స్వామి వివేకానందుని జీవితం నేటి యువత ఆదర్శంగా తీసుకొని సమాజాన్ని సన్మార్గంలో నడిపించాలని హాలియా సీఐ సతీష్ రెడ్డి అన్నారు. సోమవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా హాలియాలోని హాలియా పబ్లిక్ స్కూల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాలు వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్,మురళీ శర్మ,శ్రీనివాసులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీజేపీ ఆధ్వర్యంలో పట్టణం లోని హౌజింగ్‌బోర్డులో గల పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బంటు సైదులు, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పలువురు నాయకులు కొనియాడారు. సోమవారం మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానిక పూలమాలలువేసి నివాళులర్పించారు.

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్వామి వివేకానంద 163వ



జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యక్షులు ఎన్‌విటి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి కృష్ణకిషోర్, చంద్రశేఖర్, వెంకటేష్‌పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**స్వామి వివేకానంద బోధనలు నేటి యువత కు స్ఫూర్తి దాయకమని వారు ఆచరించిన మార్గంలో ప్రతిఒక్కరు పయనించాలని నల్లగొండ మాజీ సభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి సూచించారు. సోమవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణంలోని వీటి కాలనిలో గల స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోజిల్లా గ్రంధాలయసంస్థ మాజీ అధ్యక్షులు రెగట్టే మల్లిఖార్జున రెడ్డి,నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ ముందడి సైదిరెడ్డి పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ఎల్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ ప్రొఫసర్ అల్వాల రవి ప్రసంగిస్తూ దేశానికి యువత బలమని యువతరానికి మార్గదర్శి వివేకానందుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ దోమల రమేష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మర్రిగూడ:** స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా స్థానిక బస్సు డిపో వద్ద యూత్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ వీరమల్ల శిరీషలోకేశ్ గౌడ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రమాద సమయంలో మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చని వారు పేర్కొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామపంచాయతీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, కార్యదర్శి అంబోజు శేఖర్ పాల్గొన్నారు.



## 108 కళాశాలతో అభిషేకం

**ప్రజాపక్షం/వలిగొండ :** శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి గోదా అమ్మవారికి 108 కళాశాలతో అత్యంత వైభవంగా అభిషేకం అలంకరణ దేవస్థానం వెంకటాపురం నందు ఉత్సవాల భాగంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో మోహన్ బాబు అర్చకులు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐకి శుభాకాంక్షలు




**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండల పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పందిరి విష్ణుమూర్తిని సోమవారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో గడగోజు ఎల్లా చారి, నవీన్,వేణు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** గత కొంతకాలంగా పేరుకుపోయిన పారిశుద్ధం పనుల పై నార్కట్ పల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చెర్రీపోతుల భరత్ గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు.ఈక్రమంలోనే సోమవారం పట్టణ కేంద్రంలో 9వ వార్డు లో డ్రైనేజ్,డంపింగ్ యార్డ్ వివిధ సమస్యలపై వార్డు సభ్యులు నడింపల్లి నరేశ్ యాదవ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈఓ ఎండీ సుబానుద్దీన్, వార్డు సభ్యులు పర్రేపాటి సైదులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లకు సన్మానం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడివో కార్యాలయంలో సోమవారం మండల వ్యాప్తంగా నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లతో మర్యాద పూర్వక సమావేశం ఏర్పాటు చేయండి జరిగింది. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ హరికృష్ణ, డా. ప్రవీణ్‌కుమార్, వెటర్నరీ డా. యాకుబ్ పాల్గొన్నారు.

## తుది ఓటరు జాబితా

**ప్రజాపక్షం/దేవరకొండ;** సోమవారం మునిసిపాలిటి కార్యాలయంలో కమిషనర్ వై. సుదర్శన్ ఫోటోతో కూడిన ఓటర్ల తుది జాబితా పురపాలక సంఘం కార్యాలయంలో ప్రదర్శించారు. మునిసిపల్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందని కమిషనర్ తెలిపారు.

## ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో పులిమేడు ఆశ్రమం స్వాముల ఇరుమడి కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పులిమేడు ఆశ్రమం ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రాల ఆవరణలో పేదలకు ఉచితంగా పంపిణి చేసేందుకు దుస్తువులును ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో తులాబారం వేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



## సంక్రాంతి ముగ్గుల పోటీలు



**ప్రజా పక్షం/తిరుమలగిరి సాగర్:** మండల పరిధిలోని కొంపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వద్ద నూతన గ్రామ సర్పంచ్ జంగాల సాయమ్మ(రవీందర్) ఆధ్వర్యంలో సంక్రాంతి రంగవల్లుల ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా సాగర్ సర్కిల్ సీఐ శీను నాయక్, తిరుమలగిరి సాగర్ ఎస్సై వీరశేఖర్,మండల సమైక్య ఏపిఎం రాజేశ్వరి పాల్గొన్నారు. ముందుగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సర్పంచ్ సలహాదారుడు పగడాల సైదులు యాదవ్, కుర్ర శంకర్ నాయక్ ,కంభంపాటి శ్రీను, వార్డు మెంబర్లు నారాయణరెడ్డి, యాదయ్య గ్రామ పెద్దలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** వయోవృద్ధుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం పట్టణంలో వయోవృద్ధుల సంక్షేమ భవనాన్ని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేసిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యజీవితంలో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా రెడ్ క్రాస్ సంస్థ వారు ఏర్పాటు చేసిన క్యారం బోర్డ్, టేర్డ్ టెన్నిస్, చెస్ వంటి ఆటలుతో ఉల్లాసంగా జీవితం గడపాలని కోరారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కాసుల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగాల్ రెడ్డి, ఫోటోల శ్యామ్ గౌడ్ పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం చౌటుప్పల్ లో ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గీత కార్మికుల పనుల నిమిత్తం వెళ్ళవలసిన ఎక్సైజ్ కార్యాలయం అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గీత పని వాళ్ళ సంఘం మండల అధ్యక్షులు, కార్యదర్శిలు పందుల యాదగిరి గౌడ్, తండ యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి మరియు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్‌కు కలిసి రెవిన్యూ డివిజన్ చౌటుప్పల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలలోని సొసైటీ అధ్యక్షులు విరమల్ల యాదయ్య, నాతి కృష్ణయ్య, పొట్ట నరసింహ, సుర్వి యాదయ్య, సుర్వి రాములు, రామచంద్రం ఉడుగు భీమయ్య, కొండూరు స్వామి, బాలగోని మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# చండూరు మున్సిపాలిటీ వార్డు వారీగా ఓటర్ల తుది జాబితా విడుదల

**మొత్తం వార్డులు 10, మొత్తం ఓటర్లు సంఖ్య 11,370**

**పురుష ఓటర్లు 5,652 మంది , మహిళా ఓటర్లు 5,717 మంది, ఇతరులు ఒక్కరు**

**ఉత్కంఠ రేపుతున్న చైర్మన్ రిజర్వేషన్ ఖరారు**

**ప్రజాపక్షం/చండూరు:** త్వరలో జరుగనున్న చండూరు మున్సిపాలిటీ వార్డు వారీ తుది జాబితాను సోమవారం మున్సిపాలిటీ కమీషనర్ మల్లేశం మున్సిపల్ అధికారులతో కలిసి విడుదల చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 10 వార్డులు ఉండగా ప్రతి వార్డులో ఫోటోతో ఉన్న ఓటరు జాబితాను అందుబాటులో ఉంచారు. మున్సిపాలిటీలోని మొత్తం 10 వార్డులో 11వేల 370మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 5,652 ఉండగా మహిళా ఓటర్లు 5,171మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో ఒక ట్రాంజెండర్ ఓటరు ఉన్నట్లు మున్సిపల్ కమీషనర్ తెలిపారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన వార్డులో పోటీ చేయుటకు ఇప్పుడు ఆ వార్డులో తమకు వారికి అనుకూలంగా రిజర్వేషన్ వస్తుందా లేదా అని ఇప్పటినుండే లెక్కలు వేసుకుంటున్నారు. గతంలో చండూరు మున్సిపల్ చైర్మన్ బిసి మహిళకు రిజర్వేషన్ కాగ ఇప్పుడు జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఖరారు అవుతుందోనని చైర్మన్ రేసులో ఉన్న రాజకీయ పార్టీల నాయకులలో ఉత్కంఠ నెలకొంది. మొత్తం మీద చండూరు చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందో మరికొన్ని రోజులు వేచిచూడక తప్పదు.

### వార్డుల వారీగా ఓటర్లు జాబితా ఈ క్రింద విధంగా ఉన్నాయి

| వార్డు నెంబర్ | పురుష ఓటర్లు | మహిళ ఓటర్లు | ఇతరులు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|
| 1 | 527 | 533 | 0 | 1060 |
| 2 | 559 | 576 | 0 | 1135 |
| 3 | 594 | 612 | 0 | 1026 |
| 4 | 625 | 633 | 1 | 1259 |
| 5 | 567 | 556 | 0 | 1123 |
| 6 | 540 | 552 | 0 | 1092 |
| 7 | 524 | 544 | 0 | 1068 |
| 8 | 504 | 502 | 0 | 1006 |
| 9 | 663 | 642 | 0 | 1305 |
| 10 | 549 | 567 | 0 | 1116 |
| | 5652 | 5717 | 1 | 11370 |



## క్రీడలతో మానసికోల్లాసం

**ప్రజాపక్షం/వలిగొండ :** మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో గ్రామస్థాయి క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారం క్రీడలను సోమవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిత నర్సింగ్, ఉప సర్పంచ్ బూడిద నాగరాజుపాల్గొన్నారు.

## నిరసన సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కొడ్లను రద్దుచేయాలని, జి రామ్ జి చట్టాన్ని, విద్యుత్తు సవరణ చట్టాన్ని, విత్తన బిల్లును వెంటనే విరవించు కోవాలనీ జనవరి 19న జిల్లా కేంద్రంలో జరిగే నిరసన సభను జయప్రదం చేయాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం తుర్కపల్లి, మండలంలోని వెంకటాపురం గ్రామంలో సీఐటీయూ గ్రామ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసిన అనంతరం కరపత్రాన్ని విడుదల చేశారు. వెంకటాపురం సిఐటియు గ్రామ సమన్వయ కన్వీనర్‌గా మన్నె బిక్షపతి, కో కన్వీనర్‌గా మునిగి నరసింహులును ఎన్నుకున్నారు.

## వివేకానందుడి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని స్వామి వివేకానందుడి 163వ జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో ఏబివిపి ఆధ్వర్యంలో, గుమ్మడవల్లి గ్రామంలో జన చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం) :** మండల కేంద్రంలో గల నేతాజీ యువజన మండలి భవనం వద్ద స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.

ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం) : భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాత శ్రీ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని మండల కేంద్రంలో శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని కొట్టాల గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ కల్లెట్ల లింగయ్య ఆధ్వర్యంలో స్వామివివేకానంద 164 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకువ్యాసరచన,ఉపన్యాసం,నృత్యం, రంగోలి, చైర్ గేమ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్వామి వివేకానందుని బోధనలు స్ఫూర్తిగా తీసుకోని ముందుకు సాగాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. సోమవారం స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.






# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం సారధినగర్‌కు చెందిన ఎస్‌కె అతిర్ 48వ డివిజన్ పరిధిలో తమ ఇంటి పక్కన అనాధి కారికంగా కారం పిండిమిల్లు నడుపుతున్నారని దీని వల్ల తమ కుటుంబ సభ్యులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని మిల్లును మార్చాలని దరఖాస్తు చేశారు. వైరా శాంతినగర్‌కు చెందిన కె. వెంకటేశ్వర్లు తనకు 69 వయస్సు ఉందని వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. సత్తుపల్లి మండలం రుద్రక్షపల్లికి చెందిన కె. రమేష్ సిద్ధారం గ్రామానికి సంబంధించి రేషన్ షాపు డీలర్ పోస్టు ఖాళీగా ఉందని తనకు అర్హత ఉన్నందున ఆ పోస్టును మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. మధిర మండలం చిలుకూరు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపును రద్దు చేయాలని కోరుతూ స్థానికులు దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# భట్టి గ్యారంటీ కార్డులు.. బాకీ కార్డులయ్యాయి

**- భట్టికి పట్టిన మధిర మున్సిపాల్టీ ఎన్నికల భయం**
**- మాజీ ఎంపి నామ**




**ప్రజాపక్షం/మధిర :** ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క గ్యారంటీ కార్డులను భద్రంగా దాచుకోవాలని చెప్పారని, కాని నేడు అవే గ్యారంటీలు హామీలుగా మారి చివరకు బాకీ కార్డులుగా మిగిలి పోయాయని ఖమ్మం మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు విమర్శించారు. మధిర మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేయాలని దానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో బాకీ కార్డులను చేతబట్టి ప్రతి ఇంటికి వెళ్లి, భట్టి బాకీ పడ్డ హామీలు నెరవేర్చిన తర్వాతనే మధిర పట్టణంలో ఓటు అడగాలని కోరారు. మధిర మున్సిపాల్టీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందని వారు అన్నారు. నేడు ఎన్నికలు వస్తున్నాయని 15 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు ఇచ్చి ప్రజలను మభ్య పెడుతూ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. రెండేళ్లుగా బిఆర్ఎస్ పార్టీ హయాంలో నిర్మించిన ప్రభుత్వ హాస్పటల్‌ను ప్రారంభించకుండా నేడు ఎన్నికలు వస్తున్నాయని ప్రారంభిస్తున్నారని అన్నారు. భట్టికి మధిర మున్సిపల్ ఎన్నికల భయం పట్టుకుందని వారు ఎద్దేవా చేశారు. రూ.100కోట్లతో కేసిఆర్ నాయకత్వంలో మధిర పట్టణాన్ని అభివృద్ధి చేస్తే నేడు రూ.128 కోట్లతో మధిర పట్టణాన్ని విధ్వంసం చేశారని అన్నారు. త్వరలో జరుగనున్న మధిర మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పల్లపోతు వెంకటేశ్వరరావు, అరిగే శ్రీనివాసరావు మాజీ మున్సిపల్ చైరపర్సన్ మొండితోక లత జయాకర్, నాయకులు రావూరి శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, బిక్కి కృష్ణప్రసాద్, వంకాయలపాటి నాగేశ్వరరావు, చావా వేణు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఐలూరు ఉమామహేశ్వరరెడ్డి, జగన్మోహన్ రావు, వైవి.అప్పారావు, మాధవి, కోన నరేందర్‌రెడ్డి, అబ్బూరి రామన్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో రాణించాలి

**-విద్యార్థులను అభినందించిన డిఈవో చైతన్యజైని**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి ఖమ్మం జిల్లా పేరును ఇనుమడింపజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైని తెలిపారు. ఈ నెల ఆరు నుండి తొమ్మిది వరకు కామారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఖమ్మం జిల్లా తరుపున పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో డిఈవో చైతన్య జైని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డిఈవో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించిన ఎగ్జిబిట్‌ను మరి కొంత ఆధునీకరించి జాతీయ స్థాయిలో పాల్గొనాలన్నారు. దీనికి అవసరమైన మార్పులు సూచించామని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. సుస్థిర వ్యవసాయం అనే ఇతివృత్తంలో జూనియర్ విభాగంలో పంట అవశేషాలను తగలబెట్టకుండా ఉపయోగపడే బాయిలో బయో అరోమాటిక్స్‌గా మార్చే ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం పొందిన త్రివేణి టాలెంట్ స్కూల్‌కు హరిచరణ్‌ను, ఆరోగ్యం, పరిశుభ్రత అనే ఇతివృత్తంలో స్మార్ట్ హెల్త్ మానిటరింగ్ సిస్టం అనే అంశాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి జనవరి 19 నుంచి జరగబోయే దక్షిణ భారత సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన న్యూఇరా పాఠశాలకు చెందిన శ్రేష్టశ్రీ, వారి గైడ్ టీచర్లను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన చిన్నారులను డిఈవో తో పాటు ఎంఎంవో పెసర ప్రభాకర్‌రెడ్డి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, గైడ్ టీచర్లు అభినందించారు.ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు రాధాకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో సంక్రాంతి ఘుమఘుమలు

**ప్రజాపక్షం/కల్లూరుః** గ్రామాల్లో సంక్రాంతి పర్వదిన సందర్భంగా పిండివంటలతో గృహాలు ఘుమఘుమ లాడుతున్నాయి .మండల పరిధిలోని సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబాలలో పిండి వంటలతో ఘుమఘుమలు తో ఉన్నాయి ఒకే కుటుంబానికి చెందిన కొందరు కలిసి గృహాలలో పిండివంటలు చేసుకుంటున్నారు. పట్నం నుంచి పల్లెకు వచ్చిన ఉద్యోగులు, విద్యార్థులు తో కలిసి గృహాలు కళకళలాడుతున్నాయి మండల పరిధిలోని లింగాల, చెన్నూరు ,పెద్ద కోరుకొండి ,చిన్న కోరుకొండి, ముచ్చవరం, బత్తులపల్లి, పేరు వంచ ,మర్లపాడు, తెలగవరం ,వెన్నవల్లి , చండ్రు పల్లి ,రఘునాథ గూడెం ,తదితర గ్రామాలలో బంధుమిత్రులతో గృహాలలో కళకళలాడుతున్నాయి మరికొన్ని గృహాలలో మూడు తరాల వారు కలుసుకున్నారు .గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న గత స్మృతులను గుర్తుకు తెచ్చుకుంటున్నారు ఈ సందర్భంగా పిండివంటలైన అరిసెలు, కారప్పూస ,చెక్కలు, కజ్జికాయలు ,ఇష్టమైన వంటలను చేసుకొని ఆరగిస్తున్నారు. ఈ పర్వదినం సందర్భంగా పలు రకాల పంటలు ఒకేసారి ఇంటికి రావడం బంధుమిత్రులు కుటుంబాలలో కలుసుకోవడం తో ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యారు.



# వినియోగదారులకు డిప్యూటీ సిఎం లేఖలు

**-ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా వినూత్న కార్యక్రమం**
**- విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా వినూత్న కార్యక్రమం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు చేపట్టినట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసాచారి తెలిపారు. అందులో భాగంగా గృహ జ్యోతి పథకం లబ్ధిదారులకు, వ్యవసాయ ఉచిత లబ్ధిదారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షల లేఖను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో గృహజ్యోతి, వ్యవసాయ లబ్ధిదారులకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క శుభాకాంక్షల లేఖలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖాధికారి శ్రీనివాసాచారి మాట్లాడుతూ వినియోగదారుల ఇండ్లకు విద్యుత్ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి స్వయంగా ఈ శుభాకాంక్షల లేఖలను అందజేస్తున్నారని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా వినియోగదారులు, విద్యుత్ శాఖాధికారుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడతాయన్నారు. భవిష్యత్తులో పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లా వ్యాప్తంగా గృహజ్యోతి పథకానికి సంబంధించి 2,46,885 మంది వినియోగదారులు, వ్యవసాయ ఉచిత విద్యుత్ పథకం క్రింద 1,18,231 మంది వినియోగదారులకు ఈ లేఖలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, విద్యుత్ శాఖాధికారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వివేకానందుని స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వివేకానందుని స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని షీటీమ్స్ ఎస్ఐ షాహినా తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సోమవారం ఖమ్మం జిల్లా గ్రంథాలయంలో మేరా యువ భారత్ ఖమ్మం జిల్లా, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం షీటీమ్స్ ఎస్ఐ షాహినా పాల్గొని వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం సంపాదించాలంటే కొన్ని సూత్రాలు ఉండాలన్నారు. ఉద్యోగం రాకపోతే ప్రతి వ్యక్తికి ఏదో ఒక ప్రత్యేకమైన కళ ఉంటుందని దానిని వెలికితీసి దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఫోక్సో వంటి కఠినమైన చట్టాల గురించి యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాసరచనలో మొదటి బహుమతి జి. దామ్లానాయక్, రెండవ బహుమతి పగడాల వెంకటేష్, మూడవ బహుమతి ఆర్‌కె కుంజన్ సాధించారు. వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేరా భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. భానుచందర్, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య, జిల్లా యువజన సంఘాల సమితి అధ్యక్షులు కోడిరెక్క ఉమాశంకర్, జాయింట్ సెక్రటరీ గోగుల చంద్రశేఖర్, లైబ్రరీ అధికారి బాబు, వాలంటీర్స్ నరేందర్, మోహన్‌లాల్, రవీందర్, యువతీ, యువకులు పాల్గొన్నారు.



# ఇందిరా మహిళా డైరీలో ప్రతి మహిళ సభ్యత్వం కల్గిఉండాలి

**ప్రజాపక్షం/చింతకాని :** ఇందిరా మహిళా డైరీలో సంఘంలో ఉన్న ప్రతి మహిళా సభ్యత్వం కలిగి ఉండాలని డిఆర్‌డీవో సన్యాసయ్య పేర్కొన్నారు. సోమవారం చింతకాని రైతు వేదిక నందు చింతకాని, బోనకల్ మండల మహిళా సమాఖ్య ఓబి సభ్యులకు, ఇందిరా డెయిరీ కమిటీ సభ్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సన్యాసయ్య మాట్లాడుతూ డెయిరీ కోసం క్యాటిల్ షెడ్ నిర్మాణం వేగవంతం చేయాలని, షెడ్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. షెడ్ల నిర్మాణం కోసం అవసరమైతే గ్రామసమాఖ్యల ద్వారా రుణ సదుపాయం కల్పించాలన్నారు. స్త్రీ నిధి బకాయిలను రికవరీ చేయాలని ఈ నెల చివరి వరకు 80శాతం వసూలు చేయాలని దీనికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ సమావేశంలో ఏపిఓ డెయిరీ నరసింహులు, స్త్రీనిధి రిజనల్ మేనేజర్ రవీందర్ నాయక్, డిపిఎం ఆంజనేయులు, చింతకాని , బోనకల్ ఏపీఎంలు నాగపుల్లారావు, కొట్టె వెంకటేశ్వర్లు, ఏపీఓ కోటయ్య, వెటర్నరీ డాక్టర్ శ్రీహరి, ఐకేపీ సీసీలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని మున్సిపాలిటీ పరిధిలో సంక్రాంతి పండుగ సందర్భంగా మార్కెట్ కమిటీ ఆవరణలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన వారికి స్థానిక ఎమ్మెల్యే మట్టారాగమయి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మహిళలకు ఈ పండుగ ఎంతో ప్రాముఖ్యంగా ఉంటుందని ఈ పండుగను ప్రజలు ఉల్లాసంగా ఉత్సాహంగా కుటుంబాల పరంగా ఐక్యంగా జరుపుకోవాలని కోరుతూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భోగి మంటలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి ,సిడిపిఓ నిర్మల జ్యోతి చంద్రశేఖర్ తహసిల్దార్ పులి సాంబశివుడు, కమిషనర్ రామ్ చంద్రరావు, మేనేజర్ నాగేశ్వరరావు, ఐ కే పి ఎ పి యం అశోక రాణి, నాయకులు పసుమర్తి చంద్రరావు, మెప్మా రిసోర్స్ పర్సన్ లు, ఐకెపి సిబ్బంది యూత్ కాంగ్రెస్ నాయకులు ఆలకుంట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

